క్లుప్తంగా

మహేశ్వరం ఎంపీడీఓగా శైలజ



మహేశ్వరం: మహేశ్వరం ఎంపీడీఓగా శైలజ మంగళవారం కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు మహేశ్వరంలో పని చేసిన ఎంపీడీఓ నర్సింహ వికారాబాద్ జిల్లాకు బదిలీ కాగా, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో పని చేసిన శైలజ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శైలజ మాట్లాడుతూ.. మండల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. మండలంలో ఉన్న అధికారులు, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులతో పాటు ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

గృహలక్ష్మి నమోదు కేంద్రం ప్రారంభం



నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భిక్షపతిచారి

మీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీలన్నింటిని అమలు చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి అన్నారు. గృహలక్ష్మిలో భాగంగా మంగళవారం సిర్లాహిల్స్ కాలనీలో 200 యూనిట్ల లోపు ఉన్న విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. అనంతరం కాలనీలో తాత్కాలిక నమోదు కేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ పథకానికి సంబంధించి విద్యుత్ బిల్లు, ఆధార్, రేషన్‌కార్డుతో కేంద్రానికి వెళ్లి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు రుద్ర వెంకటేష్, భాస్కర్‌చారి, రాజు, ఆంజనేయులు, సత్యనారాయణ, హరి, అరవింద్, సురేష్ పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి కృషి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్ శివకుమార్

తుక్కుగూడ: వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కౌన్సిలర్ వై.శివకుమార్ అన్నారు. మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో మహంకాళి ఆలయం ముందు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల హవా



పతకాలతో విద్యార్థులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నేషనల్ కరాటేలో సత్తా చాటారు. ఇటీవల నిర్వహించిన నీజీ షోటోకాన్ నేషనల్ ఓపెన్ చాంపియన్ షిప్ ఏపీలోని వైజాగ్‌పోర్టులో నిర్వహించారు. ఈ పోటీలకు బడంగ్‌పేటలోని దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అందులో జోషిక (బంగారు, వెండి) పునర్విక (రజతం), హర్షిత్ (రజతం, కాంస్యం), అశ్రిత్‌రామ్ (బంగారు, వెండి), భువన్(రజతం), యువానంద్ అఖీల్ (రజతం) తదితర విద్యార్థులు పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాల సమావేశం ఏర్పాటు చేసి కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ ఏపీఎస్ రెడ్డి, డైరెక్టర్ విజేత, ప్రిన్సిపాల్ చంద్రకళ, కరాటే మాస్టర్ లక్ష్మీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం భక్తులు బారులు తీరారు. బోనాలు నైవేద్యంగా సమర్పించుకున్నారు. అనంతరం సామూహిక శ్రీ సత్యానారాయణ వ్రతాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కేంద్రం.. సమస్యలమయం!

వసతుల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న జనం



బస్ స్టాప్ లేక ఎండలోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



కందుకూరు ప్రధాన చౌరస్తా

కందుకూరు: పేరుకే డివిజన్ కేంద్రం.. సౌకర్యాలు మాత్రం శూన్యం. ప్రజలకు అవసరమైన ప్రధాన వసతులు కరువైయ్యాయి. దీంతో నిత్యం అక్కడికి వచ్చి వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇదీ కందుకూరు పరిస్థితి. మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. డివిజన్ కేంద్రంగా ఏర్పడి ఏళ్లు అవుతున్నా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అధికారుల తీరు సాక్షాత్కరిస్తోంది.

విఫలమైన అధికార యంత్రాంగం

కందుకూరు గ్రామం మొదట 1982లో మండలం అయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో డివిజన్ కేంద్రంగా రూపాంతరం చెందింది. ఆర్డీఓ కార్యాలయం సైతం ఏర్పాటైయింది. మిగతా కార్యాలయాలు కొన్ని మాత్రమే ఇక్కడ కొలువుదీరాయి. దీంతో మండలం పరిధిలోని చుట్టు పక్కల గ్రామాలతో పాటు డివిజన్ కేంద్రం కావడంతో కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, మహేశ్వరం, బాలాపూర్, సరూర్ నగర్ మండలాలకు చెందిన ప్రజలు ఇక్కడికి పనులపై వచ్చి వెళ్తుంటారు. అయినా వారికి కనీస మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు విఫలమైయ్యారు.

అత్యవసరమైతే ఇబ్బందులు

దీంతో పాటు శ్రీశైలం రహదారిపై కందుకూరు ప్రధాన చౌరస్తా విస్తరించి ఉంది. పనులపై ఆ ప్రాంతానికి వచ్చి వెళ్లే ప్రజలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలకు ఆ సమస్య మరీ ఇబ్బందికరంగా మారింది. మూత్ర విసర్జన చేయాలంటే కిలో మీటర్ దూరం నడవాల్సిందే. దాంతో పాటు చౌరస్తాలో ఆర్టీసీ బస్ స్టాప్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడస్తూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. దాహం వేస్తే తాగునీరు కొనుగోలు చేసి తాగాల్సిందే. డివిజన్ ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా సమస్యలు మాత్రం అదేలా ఉన్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు బడ్జెట్

బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి



బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో మంగళవారం మొదటి సారిగా కౌన్సిల్ సమావేశంతో పాటు వార్షిక బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. మేయర్ చిగురింత పారిజాతారెడ్డి అధ్యక్షతన వార్షిక బడ్జెట్ 2024–25లో రూ.82.78 కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశ పెట్టగా పాలక మండలి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం మేయర్ పారిజాతారెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా కాలనీలు, నివాసాలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో డ్రైనేజీ, రోడ్లు, మంచినీటి సౌకర్యం, వీధిదీపాలతో పాటు మౌలిక వసతుల కల్పనతో పాటు వరదల నియంత్రణ కోసం ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మిస్తామన్నారు. బడంగ్‌పేట ప్రజల ప్రగతి కోసం రాబడిని ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కమిషనర్ సుమన్‌రావు, అధికారులు, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ ప్రోగ్రామ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కందుకూరు: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్(సీజీఆర్) పర్యావరణ సంస్థ, ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల, మోడల్ స్కూల్, పులిమామిడి జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. కాగా ఆయిస్టర్ సంస్థ కోఆర్డినేటర్లు ఐశ్వర్య, ఖసిఫ, భవానీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ కోర్సుల గురించి అవగాహన కల్పించారు. క్యారియర్ గైడెన్స్‌కు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సీజీఆర్ సంస్థ ప్రతినిధి రజనీకాంత్ మాట్లాడుతూ.. చదువు విలువ తెలుసుకుని జీవితంలో లక్ష్యాలను సాధించడానికి విద్యార్థి దశ నుంచే బీజం వేయాలన్నారు. అందుకు తమ సంస్థ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయిస్టర్ సంస్థ సభ్యులు పల్లవి, విజయ్, కిరణ్, సుమిత్, గణేష్, ఆయా స్కూల్స్ ప్రిన్సిపాళ్లు బి.శ్రీధర్, శ్రీనివాస్‌శర్మ, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘చలో నల్లగొండ’కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



మీర్‌పేట నుంచి సభకు వెళ్తున్న కామేష్‌రెడ్డి

మీర్‌పేట: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘చలో నల్లగొండ’ సభకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి తరఫున పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వెళ్లిన వారిలో కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, బైగళ్ల బాలమణి, గౌరీశంకర్, కో ఆప్షన్ సభ్యుడు రవినాయక్, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, భూపేష్‌గౌడ్, శ్రీనునాయక్, వంటేరు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: నల్లగొండ పట్టణ కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కృష్ణ నీటి అంశంపై నిర్వహించిన బహిరంగ సభకు తుక్కుగూడ మున్సిపాలిటీ నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకత్వంలో అధిక సంఖ్యలో స్థానికులు బయలుదేరారు.

తాగునీటి పైప్‌లైన్ పనుల పరిశీలన



పనుల వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులను జలమండలి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఎర్రకుంటలో నూతనంగా నిర్మిస్తున్న 60 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌కు జల్‌పల్లి కమాన్ నుంచి మొదలైన పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఈ పనులను సాహెబ్‌నగర్ డివిజన్ జీఎం శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ జీఎం పి.గోవింద్ గౌడ్‌లు పరిశీలించారు. తొందరలో పనులను పూర్తి చేసి మున్సిపాలిటీలో నీటి సమస్య లేకుండా చూస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. పైప్‌లైన్ వేసే క్రమంలో వాహనాలను వన్ వే లో పోనిస్తున్నామని.. దీనికి వాహనదారులు సహకరించాలన్నారు.

పోలీసు ఉద్యోగం కత్తిమీద సాము

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి



విధుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న సీఐ వెంకట్‌రెడ్డి

పహాడీషరీఫ్: సమాజంలో శాంతి భద్రతలను కాపాడుతూ ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించడమే పోలీస్ విధి నిర్వహణ అని బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి అన్నారు. కొత్తపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం పోలీస్‌స్టేషన్ హౌజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ విద్యార్థులకు పోలీసు విధులను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినీలపై ఈవ్ టీజింగ్‌లు జరగకుండా షీ టీమ్ పని చేస్తుందని తెలిపారు. సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు రోడ్డుపై ఎడమ వైపు మాత్రమే నడిచి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల పట్ల అవగాహన పొంది, వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న స్వప్న తదితరులు

చైర్‌పర్సన్ స్వప్న

హయత్‌నగర్: మున్సిపాలిటీలో శరవేగంగా కాలనీలు విస్తరిస్తున్నాయని, పెరుగుతున్న కాలనీలకు మౌలిక వసతుల కల్పించేందుకు కృషి చేస్తున్నామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. మంగళవారం పసుమాములలోని మంజీరాకాలనీలో డ్రైనేజీ, సీసీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు శంకరయ్యగౌడ్, డీఈఈ అశోక్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవి, శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవచారి, శంకర్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞానాత్మక పుస్తకాల పంపిణీ

వనస్థలిపురం: నాటకరంగ దర్శక, నటుడు ఆంధ్ర సాంబమూర్తి జయంతి సందర్భంగా వేదభూమి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వనస్థలిపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, వాగ్దేవి పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విజ్ఞానాత్మకమైన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. అదే విధంగా రంగస్థల కళాకారులకు వారికి ఉపయోగపడే రెండు టేబుళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వేదభూమి ప్రతినిధి సీహెచ్‌వీఆర్‌కే మూర్తి, పంపన వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

మహేశ్వరం: మహేశ్వరం తహసీల్దార్ మహమూద్ అలీ మంగళవారం బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేసిన ఆయనను హెచ్ఎంఆర్ఎల్ హైదరాబాద్‌కు మార్చారు. 2022 సెప్టెంబర్‌లో మహేశ్వరం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 17 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు.

కందుకూరు ఎంపీడీఓగా సరిత



కందుకూరు: కందుకూరు నూతన ఎంపీడీఓగా బి.సరిత బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఎస్.వెంకట్రాములు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారాం మండలం నుంచి సరిత ఇక్కడికి వచ్చారు. మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానని, అందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కాగా ఆమెకు కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన యువ నాయకులు



కేటీఆర్‌ను కలిసిన రాజు

తుక్కుగూడ: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తుక్కుగూడ మున్సిపాలిటీ యువజన విభాగం అధ్యక్షుడు శ్యామేల్ రాజు మంగళవారం కలిశారు. పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక రాజకీయంపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, అన్వేష్ ఉన్నారు.

ఐదేళ్లలో మూడు ఉద్యోగాలు

కడ్తాల్: మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన మధు ఐదేళ్లలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. 2019లో రైల్వే శాఖలో ఉద్యోగం సాధించగా, ఆ తర్వాత పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం చేస్తూనే, ప్రభుత్వ గురుకుల పాఠశాల లైబ్రేరియన్‌గా ఉద్యోగం సాధించాడు. యువతకు మధు ఆదర్శంగా నిలిచాడని గ్రామస్తులు కొనియాడారు. భవిష్యత్తులో మధు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

శ్రవణ్‌కుమార్‌కు అభినందనలు

మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్ తెలంగాణ గురుకుల పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం మైసిగండి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

కూలీలు కావలెను



చౌదర్‌పల్లిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు నిబంధన ప్రకారం 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలి. రెండు వారాల్లో ఇవ్వాల్సిన పైసలు నెలలు గడుస్తున్నా.. ఇవ్వకపోవడంతో అర్ధాకలితో పనులు చేయలేమని కూలీలు తేల్చిచెబుతున్నారు. సకాలం బిల్లులు చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలు ముఖం చాటేస్తున్నారు. ఉపాధి పనులకు రండి అని ఈజీఎస్ అధికారులు బతిమిలాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- నెలలు గడుస్తున్నా అందని వేతనాలు
- అర్ధాకలితో పనులు చేయలేమని తేల్చిచెబుతున్న కూలీలు
- నచ్చజెబుతున్న అధికారులు

యాచారం: కూలీలు ఉపాధి పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 13 వేల జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రతి ఏటా 8 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తారు. నాలుగైదు ఏళ్లగా భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో ఉపాధి కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లడం వలన ఉపాధి పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. వ్యవసాయ పనులు కూడా తగ్గాయి. అయినా కూలీలు ఉపాధి పనులకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు దినసరి కూలీ రూ.272 నిర్ణయించింది. యాచారం, చింతపట్ల, నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, గునుగల్, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో వేలాది మంది కూలీలు ఉన్నప్పటికీ ఉపాధి పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు.

పనులు ఫుల్

ఉపాధి పనులు చేసుకోవడానికి గ్రామాల్లో గుర్తించిన పనులు చాలా వరకు ఉన్నాయి. వ్యవసాయ భూముల్లో భూ అభివృద్ధి పనులు, చెట్లకు పాదులు తీయడం, డొంక రోడ్లు వెడల్పు చేయడం, నర్సరీల్లో మొక్కలు పెంచడం, నీళ్ల పోయడం తదితర పనులు ఉన్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలు, మరో 20 అనుబంధ గ్రామాల్లో 13 వేల జాబ్‌కార్డుల్లో దాదాపు 15 వేలకు పైగా ఉపాధి కూలీలు ఉన్నారు. ప్రతి ఏటా 8 వేలకు పైగా కూలీలు ఉపాధి పనులు చేసుకునే అవకాశం ఉంది. కానీ యాచారం మండలంలో ప్రస్తుతం 700 మంది మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో ఈజీఎస్ క్షేత్ర సహాయకులు కూలీలను కలిసి ఉపాధి పనులకు రావాలని కోరుతున్నా.. స్పందన లేకుండా పోతోంది. గతంలో చేసిన ఉపాధి పనులకే వేలాది రూపాయలు బిల్లులు రావాలని కూలీలు అంటున్నారు. యాచారం, నందివనపర్తి, కొత్తపల్లి, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, అయ్యవారిగూడెం, నస్దిక్‌సింగారం, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలకు వేలాది రూపాయలు బకాయిలు అందాల్సి ఉంది.

వ్యవసాయానికి అనుసంధానం చేయాలి



ఉపాధి పనులకు వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలి. కూలీ రేట్లు అధికమవ్వడంతో రైతులు పెట్టుబడులకు అప్పులు చేస్తున్నారు. వ్యవసాయ పనులను కూలీల ద్వారా చేయిస్తే ఈజీఎస్ నుంచి కొన్ని నిధులు, మరికొన్ని నిధులు రైతుల ద్వారా చెల్లించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. అప్పుడే రైతు అప్పుల పాలు కాకుండా ఉంటాడు.

– మర్పల్లి బాలరాజ్ యాదవ్, రైతు మొండిగౌరెల్లి

ఉపాధి పనులకు రండి



గ్రామాల్లో కూలీలకు సరిపడా ఉపాధి పనులు గుర్తించడం జరిగింది. ఉపాధి పనులకు రావాలని కూలీలను అడుగుతున్నాం. ప్రస్తుతం మండలంలో 700 మంది కూలీలే ఉపాధి పనులకు వస్తున్నారు. మరో వారంలో రెండు, మూడు వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చే అవకాశం ఉంది. బిల్లులు సకాలంలో అందేలా కృషి చేస్తాం.

– లింగయ్య, ఈజీఎస్ ఏపీఓ యాచారం

బంజారా సంస్కృతిని కాపాడుకోవాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: బంజారాల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు గిరిజనులు, యువత కృషి చేయాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పిలుపునిచ్చారు. బంజారా యువకుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దొరసాని యూట్యూబ్ సినిమాకు సంబంధించిన ఆడియో రిలీజ్ పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి జెడ్పీటీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యా, మాజీ వార్డు సభ్యులు బీమన్, శ్రీను, రాజశేఖర్, సూర్య తదితరులు ఉన్నారు.